PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 343 పేజీలు - 08 శుక్రవారం 06 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు

ప్రభుత్వం సిద్ధం!

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 05: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన 38వ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. మూడు బ్యారేజీల ఫౌండేషన్ కటాఫ్ వాల్, డౌన్‌స్ట్రీమ్, కాంక్రీట్ దయాఫ్రం వాల్‌లో లోపాలను జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) గుర్తించి పలు సూచనలు చేసిందని మంత్రి తెలిపారు. ఎన్డీఎస్ఏ సూచించిన పరీక్షలన్నింటినీ నిర్వహించి, వాటి వివరాలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్డీఎస్ఏకు నివేదించినట్టు చెప్పారు. ఆయా సంస్థల సూచనల మేరకు మూడు బ్యారేజీల మిగతా2లో...

పారా అథ్లెట్ల పోరాటం

దేశానికి స్ఫూర్తి

114 పతకాలతో భారత్ చరిత్రాత్మక ఘనత.. క్రీడాకారులతో ప్రధాని మోదీ ప్రత్యేక భేటీ



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 05: ఆసియా పారా గేమ్స్-2026లో భారత క్రీడాకారులు సాధించిన చారిత్రాత్మక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పారా అథ్లెట్ల పోరాటం, పట్టుదల, అంకితభావం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. గురువారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పతక విజేతలతో ప్రత్యేకంగా సమావేశమై అభినందించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. గతంలో పిల్లలు క్రీడలను వృత్తిగా ఎంచుకోవడానికి తల్లిదండ్రులు సంకోచించేవారని గుర్తుచేశారు.

మిగతా2లో...

ఇందిరమ్మ కుటుంబాలతో

దీపావళి..

ప్రజాప్రతినిధులకు సీఎం పిలుపు

లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో నేనూ భాగస్వామినవుతా..

ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొనాలి: సీఎం రేవంత్‌రెడ్డి



పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ

గ్లోబల్ సమ్మిట్!

డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ.. ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 05: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. గురువారం సచివాలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానాలు పంపినట్లు, ఇప్పటికే పలు ప్రముఖ సంస్థలు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. అంచనాలకు మించి స్పందన వస్తోందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో రక్షణ, పారిశ్రామిక, ఫార్మాలైఫ్ సైన్సెస్ ఎక్స్‌పోలు

మిగతా2లో...



ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సీఈఓ సుదర్శన్‌రెడ్డికి డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 05: ఎన్నికల నిర్వహణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి గురువారం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) చేసిన అదనపు ఖర్చుల

మిగతా2లో...

గల్లంతైన 16 మంది

సురక్షితం

- బేతుపల్లి ఘటనపై ఉత్కంఠకు తెర..

అర్ధరాత్రి సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్



అక్రమ కట్టడాలపై

కవిత కన్నెర్ర!

- నెల రోజుల్లో సమగ్ర సర్వే చేపట్టాలి..

లేదంటే పార్టీ తరపున రెడ్‌మార్క్ వేస్తాం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 05: ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు రెడ్‌మార్క్ వేస్తారని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మిగతా2లో...

కొడంగల్‌లో మూడు రోజుల పాటు

సీఎం రేవంత్ పర్యటన

రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

50 వేల మంది రైతులతో భారీ సభ



ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 76న ఓట్ల లెక్కింపు!

చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్..

21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో....



పారా అథ్లెట్ల పోరాటం దేశానికి స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం క్రీడారంగంలో మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవకాశాలను మెరుగుపరుస్తోందన్నారు. యువత కలలు, ప్రతిభ వృథా కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు.ఆసియా పారా గేమ్స్‌లో తొలిసారిగా 61 మంది భారత క్రీడాకారులు పాల్గొనడం విశేషమని మోదీ పేర్కొన్నారు. రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆర్చర్ శీతల్ దేవి, దృష్టిలోపాన్ని అధిగమించి అద్భుత ప్రదర్శన చేసిన అథ్లెట్ సిమ్రన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుత విజయాలతో ఆగిపోకుండా 2028 లాస్ ఏంజెలెస్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో ఇటీవల ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు ఉన్నాయి. గతంలో భారత్ సాధించిన 108 పతకాల రికార్డును అధిగమించి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ విజయాల్లో 97 మంది భారత పారా అథ్లెట్లు భాగస్వాములయ్యారు.

ఇందిరమ్మ కుటుంబాలతో దీపావళి..

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 05: పేదల సొంతింటి కల సాకారమైన వేళ ఈ దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. పేదల సొంతింటి సంతోషంలో తాను కూడా భాగస్వామిని కానున్నానని పేర్కొన్నారు.ఈ దీపావళికి తాను ఒక ఇందిరమ్మ ఇంటికి వెళ్లి లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ జరుపుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు కూడా తమ ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని కోరారు. పేద కుటుంబాల ఆనందంలో పాలుపంచుకుంటూ వారి ఇళ్లలో దీపాలు వెలిగించాలని సూచించారు.రాష్ట్రంలో తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే 2,21,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పేదలకు సొంతింటి భద్రత, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించాలన్న సీఎం పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. యువ పారిశ్రామికవేత్తలు, జెన్-జీ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, విద్యా సదస్సుతో పాటు ఏరోబాటిక్ ఎయిర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.ఇప్పటికే హైదరాబాద్, ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, ప్రతినిధుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని సంజయ్ జాజు తెలిపారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగంగా ప్రపంచ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకర్షించడమే సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేటాయించిన బడ్జెట్ సరిపోకపోవడంతో అధికారులు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని లచ్చిరెడ్డి వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం కొందరు అధికారులు అప్పులు చేసి ఖర్చులు భరించారని, ఇప్పటికీ ఆ మొత్తాలు తిరిగి అందలేదని తెలిపారు.

బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా అప్పులు ఇచ్చినవారు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, కొందరు రుణదాతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కార్యాలయాలు, నివాసాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వల్ల వారి గౌరవానికి భంగం కలుగుతోందన్నారు.నాంపల్లి అసెంబ్లీ, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అదనపు వ్యయ ప్రతిపాదనలు సహా వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న బడ్జెట్ ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నిధులు విడుదల చేయాలని సంఘం కోరింది.

అక్రమ కట్టడాలపై కవిత కన్నెర్ర!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన కవిత.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో గురుకుల ట్రస్ట్‌కు చెందిన భూముల్లో 500 నుంచి 700 వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఆరోపించారు. మరో 80 భవనాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రిజిస్ట్రేషన్లు సాధ్యం కాని భూముల్లో నోటరీల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారని, పది అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. వాటిలో పీజీ హాస్టళ్లు, కళాశాలలు నిర్వహిస్తున్నారని, కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.అక్రమ నిర్మాణాలపై వార్తలు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను భవన యజమానులు బెదిరిస్తున్నారని కవిత ఆరోపించారు. అయ్యప్ప సొసైటీలో సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు అక్కడి భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పోలీసులపై ఫిర్యాదులేవీ అందలేదు!

- జులై 20న జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 05: జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు అరాచకత్వానికి పాల్పడ్డారంటూ భౌతికంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఉన్నత స్థాయి విచారణ కమిటీ (హెచ్‌పీఈసీ) వెల్లడించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్టోబర్ 31న సమర్పించిన చర్యల నివేదికలో ఈ విషయం పేర్కొన్నట్లు గురువారం కోర్టు వెల్లడించింది.పోలీసుల చర్యలకు సంబంధించిన వీడియో క్లిప్పులు, ఇతర ఆధారాలను కమిటీ పరిశీలనకు సమర్పించేందుకు పిటిషనర్లకు కోర్టు అవకాశం కల్పించింది. ఫిర్యాదులను అజ్ఞాతంగా నమోదు చేసేందుకు కమిటీ ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. నిరసనల సందర్భంగా పోలీసులు ఉపయోగించిన మందుగుండు సామగ్రి వివరాలను సమర్పించకపోవడంపై పిటిషనర్లు ప్రశ్నించారు.అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి జాప్యం లేకుండా నివేదికలు ఇవ్వాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నెల రోజుల్లో తొలి నిజ నిర్ధారణ నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి ఉండలేమని పేర్కొంటూ, ఈ కేసుపై డిసెంబర్‌లో మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మతులను త్వరలోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026కు సంబంధించి సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ఇతర రంగాల్లో విధానాలను సరళీకృతం చేయడం ద్వారా ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ ముందుకెళ్తోందన్నారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి గ్రామ సర్పంచ్ వరకు ప్రజాప్రతినిధులంతా తమ పరిధిలోని ఒక ఇందిరమ్మ ఇంట్లో జరిగే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని, మంత్రులందరూ పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వార్డు, గ్రామపంచాయతీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. దీనితో పాటు రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల కోసం వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

అలాగే రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో రెవెన్యూ శాఖకు చెందిన భూములను అవసరాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

గల్లంతైన 16 మంది సురక్షితం

తొలి అక్షరం/సత్తుపల్లి, నవంబర్ 05:ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు వద్ద బుధవారం సాయంత్రం మొదలైన ఉత్కంఠ చివరకు సుఖాంతమైంది. చెరువులో చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ బృందం పడవ బోల్తా పడటంతో మత్స్యకారులతో పాటు సహాయక సిబ్బంది కూడా చెరువులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి అర్ధరాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. చీకటిని సైతం లెక్కచేయకుండా మొత్తం 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి.రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఘటన జరిగినప్పటి నుంచి కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాత్రంతా చెరువు వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సూచనలు అందించారు. రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషిని, జిల్లా అధికారుల పనితీరును ప్రశంసిస్తూ రెస్క్యూ బృందాలకు ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

కొడంగల్‌లో మూడు రోజుల పాటు సీఎం రేవంత్ పర్యటన

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 05: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించడంతో పాటు రూ.9,053.48 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.ఈ నెల 7న హకీంపేటలో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభిస్తారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారు.

పారిశ్రామికవేత్తలతోనూ సమావేశం కానున్నారు.8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. రూ.5,060 కోట్ల రేడియల్ రోడ్డు, రూ.2,100 కోట్ల ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, ఆధునిక బస్టాండ్ల తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

పూర్తయిన పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలను కూడా ప్రారంభిస్తారు.పర్యటన చివరి రోజైన 9న హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఈ సభకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు సభా ప్రాంగణం, రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శన వద్ద ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

- చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్.. 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో



తొలి అక్షరం/అమరావతి, నవంబర్ 05: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి కూడా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సుమారు 21,012 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 65 నుంచి 68 శాతం వరకు ఓటింగ్ నమోదై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మధ్యాహ్నం 1 గంటకు 30.50 శాతంగా ఉన్న పోలింగ్.. ఆ తర్వాత వేగం పుంజుకుంది. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం.

కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తతలుపోలింగ్ సందర్భంగా పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రిగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో రాజకీయ పార్టీలకు చెందిన వర్గాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. కొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడినట్లు సమాచారం. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, పోలింగ్ ప్రక్రియ పెద్దగా అంతరాయం లేకుండా ముగిసింది.పోలింగ్ పూర్తయిన వెంటనే అధికారులు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేశారు. వాటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తోంది. ఎక్కడైనా తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది.నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. అనంతరం నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో పరిషత్ ఎన్నికల తుది ఫలితాలపై రాజకీయ పార్టీలతో పాటు అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

● ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు అదనపు సమయం



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 05: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, నాగాలాండ్‌తో పాటు ఢిల్లీలో ఈ ప్రక్రియకు సంబంధించిన గడువులను పొడిగించింది. తెలంగాణలో ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి నవంబర్ 26 వరకు గడువు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, హర్యానాలో నవంబర్ 20 వరకు, నాగాలాండ్‌లో నవంబర్ 25 వరకు గడువు పొడిగించింది. మహారాష్ట్రలో అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 13 వరకు కొనసాగించనున్నారు. ఈ రాష్ట్రాల్లో తుది ఓటరు జాబితాలను నవంబర్ 30న ప్రకటించనున్నారు.ఢిల్లీలో అభ్యంతరాల స్వీకరణ గడువును డిసెంబర్ 25 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించడంతో పాటు అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఈ గడువు పొడిగింపు చేపట్టినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

వేగవంతంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణం

- వచ్చే విద్యాసంవత్సరం నుంచే అకడమిక్ బ్లాక్-1 తరగతులు

- మంచిరేవులలో నిర్మాణ పనులను పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్





తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్-1 నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యాసంవత్సరం నాటికి తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు.గురువారం మంచిరేవులలో పాఠశాల నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు.అనంతరం పలు పనులకు అనుమతులు మంజూరు చేస్తూ, ప్రాజెక్టు పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.అకడమిక్, మౌలిక సదుపాయాలు, సీఎస్ఆర్, నియామకాలు,ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును డీజీపీ క్షుణ్ణంగా సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకొని, అవసరాలకు అనుగుణ ంగా మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాద కరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు.

అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని డీజీపీ స్పష్టం చేశారు.ఈ సమీక్షాలో శాంతిభద్రతల డీజీ మహేష్ భగవత్, ఆక్టోపస్ డీజీ అనిల్‌కుమార్,ఐజీపీ ఎల్.గజ రావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్,ఏఐజీ (అడ్మిన్) రమణ కుమార్,డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, క్రిమ్సన్ సహ వ్యవస్థాపకుడు విశాల్ గోయల్, వైఐపీఎస్ ప్రిన్సిపల్ అనితారెడ్డి, జయకుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత వాతావరణం - క్రమశిక్షణతో కూడిన విద్య:

ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరం. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధన అందించడం ద్వారా వైఐపీఎస్ తన ప్రత్యేకతను చాటుకుంటుంది అని డీజీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ పౌరుల పిల్లలకూ అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించే ఈ పాఠశాలకు భవిష్యత్తులో విశేష ఆదరణ లభిస్తుందన్నారు.

వచ్చే ఏటికి వేయి మందికి వసతులు:

పాఠశాలలో ప్రస్తుతం 345 మంది విద్యార్థులు ఆరో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు డీజీపీకి వివరించారు. వచ్చే విద్యాసంవత్సరానికి సుమారు 720 మందికి ప్రవేశాలు కల్పిస్తూ, మొత్తం వేయి మంది విద్యార్థులకు సదుపాయాలు



ఆర్టిజన్ల సంక్షేమానికి 327 యూనియన్ సేవలు అభినందనీయం

- 7 కీలక ఉత్తర్వులతో హర్షం వ్యక్తం చేసిన నాయకులు

-డివిజన్ కార్యాలయం వద్ద సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో -తొర్రూర్ ప్రతినిధి(సాంబ పస్తం), నవంబర్5:విద్యుత్ సంస్థలలో క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఆర్టిజన్లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా హక్కులు, సంక్షేమ ఫలాలు అందించడంలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 327 యూనియన్ (ఐఎన్టియూసి) సాగించిన పోరాటం చారిత్రాత్మకమని తొర్రూరు డివిజన్ కార్యదర్శి పసుపులేటి మధు,మహబూబాబాద్ సర్కిల్ ప్రెసిడెంట్ నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ పాషా కొనియాడారు. ఆర్టిజన్ల ఉద్యోగ భద్రతతో పాటు ఆర్థిక, సామాజిక ప్రయోజనాల సాధనకు యూనియన్ నిరంతరం కృషి చేసిందని తెలిపారు. గురువారం తొర్రూర్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో డివిజన్ కార్యదర్శి పసుపులేటి మధు ఆధ్వర్యంలో మహబూబాబాద్ సర్కిల్ ప్రెసిడెంట్ నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ పాషా లు మాట్లాడుతూ..ఉమ్మడి హైకోర్టు డివిజన్ బెంచ్ కేసు విచారణలో 327 యూనియన్ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని 23వేల మంది ఆర్టిజన్ల ఉద్యోగాల క్రమ బద్ధీకరణకు ఉన్న చట్టపరమైన అడ్డంకులను తొలగించడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయి ంట్ యాక్షన్ కమిటీ (టిజిపిఈజెఎసి) ఆధ్వర్యంలో యాజమాన్యంతో జరిపిన నిరంతర చర్చల ఫలితంగానే ఆర్టిజన్ల భవిష్యత్తుకు భరోసానిచ్చే 7 రకాల కీలక ఉత్తర్వులు వెలువడ్డాయని వెల్లడించారు.

ఆర్టిజన్లకు లభించిన 7 ప్రధాన సంక్షేమ ఫలితాలు:

సమాన సెలవులు: రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సెలవుల సదుపాయం.లీవ్ ఎన్‌క్యాష్ మెంట్: సెలవుల నగదీకరణ సౌకర్యం అమలు. మెడికల్ ఇన్వాలిడేషన్: అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించలేని వారికి నిబంధనల ప్రకారం పదవీ విరమణ అవకాశం. కారుణ్య నియామకాలు: మెడికల్ ఇన్వాలిడేషన్‌పై రిటైర్ అయిన వారి అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం.అదనపు ఇంక్రి మెంట్: ప్రతి 5 సంవత్సరాల సంతృప్తికర సర్వీసుకు ప్రత్యేక అదనపు ఇంక్రిమెంట్.రుణాల సదుపాయం: ఎంప్లాయీస్ తరహాలోనే సంక్షేమ రుణాలు, అడ్వా న్సుల లభ్యత.వైద్య పరిమితి పెంపు: హెల్త్ స్కీమ్ పరి మితిని రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు.

కృతజ్ఞతలతో పాలాభిషేకం:

ఆర్టిజన్లకు అనుకూలంగా సర్వీస్ రూల్స్, సంక్షేమ ఉత్తర్వులు విడుదల చేసినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, కంపెనీ ప్రెసిడెంట్ మహేంద్ర రెడ్డిలకు నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు, ఆర్టిజన్ ఉద్యోగులు కలిసి డివిజన్ కార్యాలయం ముందు వారి చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ డివిజన్ ప్రెసిడెంట్ కేశబోయిన బోజాలు, సబ్‌డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ట్రెజరర్ రవికుమార్, జాయింట్ సెక్రెటరీ మచ్చ సతీష్, అడిషనల్ సెక్రెటరీ జంగిర్, ఆర్గనైజ్ సెక్రెటరీ కాజాబీ, ఎల్ల స్వామి,పలువురు డివిజన్ నాయకులు, మహిళా సభ్యులు, పెద్ద సంఖ్యలో ఆర్టిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- దుస్తులు, రక్షణ పరికరాలు, నిత్యావసర వస్తువుల పంపిణీ





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 5: చౌటుప్పల్ పట్టణ పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి మున్సిపల్ పాలకవర్గం ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు చీరలు, దుస్తులు, చేతి గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం, టవల్స్, బూట్లు, వ్యక్తిగత రక్షణ కిట్లను చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్య కరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారికి అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ కార్మికుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలు భేష్.. అధికారులకు మంత్రి అభినందనలు

- ఎస్డీఆర్ఎఫ్ పటిష్టతతో ప్రాణనష్టం నివారణ: పొంగులేటి



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 5:ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వరద విపత్తు సమయంలో అధికారులు, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం జరగకుండా చేపట్టిన సహాయక చర్యలను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం సింగరేణి కాలరీస్ అతిథి గృహంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో వరద సహాయక చర్యలు, నష్టాల అంచనాపై సమీక్ష నిర్వహించారు.బేతుపల్లి చెరువులో చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులు, సహాయక సిబ్బందిని సురక్షితంగా రక్షించడం అధికారుల సమన్వయానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎస్డీఆర్ఎఫ్‌ను బలోపేతం చేశామని, 1,900 మంది సిబ్బందికి శిక్షణతో పాటు సుమారు రూ.260270 కోట్లతో ఆధునిక పరికరాలు సమకూర్చామని తెలిపారు.వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, రహదారులు, చెరువులు, ఇతర మౌలిక సదుపాయాల నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు మూడు రోజుల్లో సమగ్ర నివేదికలు సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందికి ఇళ్లు లేని పక్షంలో అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


53వ డివిజన్లో డ్రైనేజ్ నిర్మాణం చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కి వినతి పత్రం

- ఖమ్మం బిజెపి టూ టౌన్ అధ్యక్షులు ధనియాకుల వెంకటనారాయణ



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 5: ఖమ్మం కార్పొరేషన్ 53వ డివిజన్లో డ్రైనేజీ నిర్మాణంలి చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్య కి వినత పత్రం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా బిజెపి సీనియర్ నాయకులు శ్రీ గేశేటేల విద్యాసాగర్ పాల్గొని వారు మాట్లాడుతూ...ఖమ్మం 53వ డివిజన్లో సహకార నగర, ప్రాంతంలో డ్రైనేజ్ సౌకర్యం లేక మురుగునీటి సమస్య పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత ఏర్పడటంతో దోమల బెడద దుర్వాసన వ్యాధులు వ్యాప్తించే ప్రమాదం ఉందని, స్థానిక ప్రజల ఆరోగ్యానికి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఖమ్మం 53వ డివిజన్లో సహకార నగర్ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణం వెంటనే జరగాలని లేనియెడల మున్సిపల్ ఆఫీస్ ముట్టడి చేస్తామని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం బిజెపి నాయకులు, పాశం శ్రీనివాసరెడ్డి ఈశ్వర ప్రగడ లలిత, దాసరి మధు, శ్రీలక్ష్మి రెడ్డి, కాసం మమత, శ్రీజర్ల వెంకటేశ్వర్లు, దాసులి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు,

నిజాయితీ, నిబద్ధతకు మారుపేరు మీరాబాయ్



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 5: మండల రెవెన్యూ అధికారి బి. మీరాబాయ్ జన్మదినం సందర్భంగా పలువురు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తూ, నిజాయితీగల అధికారిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.తొలి అక్షరం ప్రతినిధి: దోర్నాల గజేందర్

కిసాన్ సభల మహాసభలను జయప్రదం చేయాలి

- నవంబర్ 15న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరావాలి: బూరుగు కృష్ణారెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 5:నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ మహాసభలను, 15న జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించి ప్రజలను సమీకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ రైతు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరగాళ్లకు సింహస్వప్నం.. ప్రజలకు కొండంత అండ

- శాంతిభద్రతల పరిరక్షణలో దూసుకుపోతున్న తొర్రూర్ ఎస్సై మహేందర్ రెడ్డి
- ఆరు నెలల స్వల్పకాలంలోనే విప్లవాత్మక మార్పులు
- అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం
- గుట్కా, గంజాయి, జూద ఉచ్చులకు తెగేసిన నిఘా
- రాత్రి వేళల్లో స్వయంగా రంగంలోకి దిగుతున్న ఎస్సై
- ప్రజా పోలీసింగ్ తో ప్రజల్లో చెరగని ముద్ర.. సర్వత్రా ప్రశంసల వెల్లువ



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 5: పోలీస్ అంటే లాఠీ దెబ్బల భయం కాదు..కష్టమొస్తే ఆదుకునే కొండంత అండ అనే బలమైన నమ్మకాన్ని తొర్రూరు ప్రజల మనసుల్లో నాటుతున్నారు తొర్రూరు సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) మహేందర్ రెడ్డి.బాధ్యతలు చేపట్టిన కేవలం ఆరు నెలల కాలంలోనే ఆయన చూపిన తెగువ, దక్షత తొర్రూరు పట్టణ రూపురేఖలనే మార్చేశాయి. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయనో సరికొత్త ఒరవడిని సృష్టిస్తూ.. నేరస్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. పట్టణాన్ని పీడిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై ఎస్సై మహేందర్ రెడ్డి అప్రతిహత దాడులు కొనసాగిస్తున్నారు. యువతను పెడదోవ పట్టిస్తున్న గంజాయి, గుట్కా అక్రమ మద్యం , పేకాట స్థావరాలపై నిరంతరం కొరడా ఝుళిపిస్తున్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడమే కాక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టం ఏ విధంగా ఉంటుందో ఘాటుగానే హెచ్చరిస్తున్నారు. దీంతో నేర ప్రవృత్తి ఉన్నవారిలో వణుకు మొదలైంది.**నిద్రలేని రాత్రులు.. శ్రీనిఘా నేత్రాలు:**ప్రజలు ప్రశాంతంగా నిద్రపోవాలంటే.. తాము నిద్రపోకూడదనే నినాదంతో ఎస్సై ముందుకు వెళుతున్నారు.రాత్రి వేళల్లో గస్తీ (నైట్ పెట్రోలింగ్)ను అత్యంత కఠినతరం చేశారు.ప్రధాన కూడళ్లు, అంతర్గత వీధుల్లో స్వయంగా ఎస్సై మహేందర్ పెట్రోలింగ్ చేస్తూ అనుమానితులను తనిఖీ చేస్తుండటంతో.. రాత్రి సమయాల్లో జరిగే చోరీలు, ఈవ్‌టీజింగ్‌లు, అసాంఘిక పనులకు పూర్తిగా కళ్లెం పడింది.**ప్రజా స్నేహపూర్వక పోలీసింగ్:**స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను స్వయంగా శ్రద్ధగా ఆలకించి, తక్షణ న్యాయం చేయడంలో ఆయనది అందెవేసిన చేయి. మహిళలు, వృద్ధుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ.. కాలేజీలు, రద్దీ ప్రాంతాల్లో షీ-టీమ్‌ల ద్వారా పకడ్బందీ నిఘా ఏర్పాటు చేశారు. మహిళలకు వేధింపులు తొలగిపోయి స్వేచ్ఛగా తిరిగే వాతావరణం ఏర్పడింది.**నీరాజనం పడుతున్న జనం:**గత ఆరు నెలలుగా ఎస్సై మహేందర్ రెడ్డి ప్రదర్శిస్తున్న నిబద్ధత, అంకితభావం పట్ల తొర్రూరు పట్టణ ప్రజలు, స్థానిక వర్తక సంఘాలు, ప్రజాప్రతినిధులు నీరాజనం పడుతున్నారు. క్రమశిక్షణ, సమర్థత, ప్రజాసేవే పరమావధిగా దూసుకుపోతున్న ఎస్సై మహేందర్ రెడ్డి సేవలను కొనియాడుతున్నారు. తొర్రూరును పూర్తిగా నేరరహిత, ప్రశాంత పట్టణంగా తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి అసాధారణమని స్థానికులు ముక్తకంఠంతో ప్రశంసిస్తున్నారు.

ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేవగోని రమేష్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

- ప్రధాన కార్యదర్శిగా సుర్కంటి నర్సిరెడ్డి.. నూతన కమిటీ ఎంపిక






తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 5:చౌటుప్పల్ శ్రీ మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయ ప్రాంగణంలో ట్రాక్టర్ యజమానుల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు పూసుకురి యాదగిరి, మెండే బుచ్చయ్య, చేవగోని వెంకటేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఉడుగు ఇస్తారి ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేశారు.నూతన అధ్యక్షుడిగా చేవగోని రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా దొనకొండ గోవర్ధన్, చిందం అశోక్, ప్రధాన కార్యదర్శిగా సుర్కంటి నర్సిరెడ్డి, కోశాధికారులుగా ఆరుట్ల లింగస్వామి, ముప్పిడి లింగస్వామి గౌడ్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా సరిపల్లి అశోక్, పూసుకురి శీను, బొంగు శివగౌడ్‌ను ఎంపిక చేశారు. పలువురిని గౌరవ సభ్యులుగా నియమించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చేవగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రాక్టర్ యజమానుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని, అందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

చౌటుప్పల్‌లో జంక్షన్ల విషయంలో అధికారుల ఇష్టారాజ్యం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు!

జంక్షన్లు తెరవడం, మూసివేయడంలో సమన్వయ లోపం.. ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలి: అడ్వకేట్ చెరుకు శివకుమార్ గౌడ్



తొలి అక్షరం/చౌటుప్పల్:నవంబర్ 5: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో జంక్షన్ల నిర్వహణలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దాటేందుకు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన జంక్షన్ల విషయంలో అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది, కాంట్రాక్టర్ మధ్య సమన్వయం కొరవడిందని అడ్వకేట్ చెరుకు శివకుమార్ గౌడ్ విమర్శించారు.ఒకసారి జంక్షన్లను తెరిచి, మరికొంత సమయానికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మూసివేస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జంక్షన్లు మూసివేయడంతో ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోవడానికి చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా తంగడపల్లి రోడ్డు జంక్షన్ పునరుద్ధరణ విషయంలో ఇటీవల కొంతమంది సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మళ్లీ పాత పరిస్థితులే కొనసాగుతున్నాయని విమర్శించారు. ప్రచార ఆర్భాటాలకు పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

అధికారులు తక్షణమే స్పందించి చౌటుప్పల్ పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని జంక్షన్లను పునరుద్ధరించాలని, వాటి నిర్వహణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల ప్రయాణ ఇబ్బందులను అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు. జంక్షన్ల సమస్యకు వెంటనే శాశ్వత పరిష్కారం చూపకపోతే ప్రజల పక్షాన మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని చెరుకు శివకుమార్ గౌడ్ హెచ్చరించారు.

నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ సేవకు గుర్తింపు ఎప్పుడు?

పార్టీ కష్టకాలంలోనూ జెండా వీడని డాక్టర్ ఆర్. మాధవరెడ్డికి పదవి దక్కేనా?

సీనియర్ నాయకుడి సేవలను గుర్తించాలని అనుచరుల విజ్ఞప్తి



తొలి అక్షరం ప్రత్యేక కథనం/చౌటుప్పల్, నవంబర్ 5: రాజకీయాల్లో పదవులు, అధికారాన్ని ఆశించకుండా పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకులు కొందరే ఉంటారు. అలాంటి వారిలో డాక్టర్ ఆర్. మాధవరెడ్డి ఒకరని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్నప్పటికీ ఆయనకు తగిన రాజకీయ గుర్తింపు లభించకపోవడంపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 1983లో రాజీవ్ ట్రస్ట్‌ను స్థాపించిన ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారు. పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచారని, తన పరిచయాల ద్వారా పలువురిని కాంగ్రెస్‌కు చేరువ చేయడంలో కృషి చేశారని అనుచరులు చెబుతున్నారు. రాజకీయ సేవలతో పాటు వైద్య వృత్తిలోనూ పేదలకు సేవలందిస్తూ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులతో ఆయనకు సుదీర్ఘ పరిచయాలు ఉన్నాయి. మాజీ మంత్రి ఊపునూతల పురుషోత్తం రెడ్డి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, కుందూరు జానారెడ్డి, చకిలం శ్రీనివాస్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితర నాయకులతో ఆయనకు పరిచయాలు ఉన్నాయని తెలుస్తోంది. అయినప్పటికీ పార్టీ కోసం ఇన్నేళ్లుగా పనిచేస్తున్న ఆయనకు తగిన బాధ్యతలు దక్కకపోవడం అనుచరులను నిరాశకు గురిచేస్తోందని సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులను గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన శ్రేయోభిలాషులు అభిప్రాయపడుతున్నారు. డాక్టర్ ఆర్. మాధవరెడ్డికి సముచితమైన నామినేటెడ్ పదవి లేదా పార్టీలో కీలక బాధ్యత అప్పగించాలని కోరుతున్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన నాయకుల సేవలను గుర్తించడం ద్వారా కార్యకర్తల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొంటున్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను వీడకుండా కొనసాగుతున్న డాక్టర్ ఆర్. మాధవరెడ్డి సేవలను పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం ఎప్పుడు గుర్తిస్తాయోనని ఆయన అనుచరులు ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై చర్చ

- ఆర్.జె.సి. కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన బానోత్ సుందర్ లాల్



తొలి అక్షరం/ ఏన్కూర్ నవంబర్ 5: వైరా నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్.జె.సి. కృష్ణను ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ సుందర్ లాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాలోత్ బాల, ఏన్కూరు మాజీ జడ్పీటీసీ బాలాజీ, గార్ల ఒడ్డు మాజీ సర్పంచ్ బాలాజీ, జిల్లా మైనార్టీ నాయకులు గౌసుద్దీన్, ఉండ్రాతి మోహన్ రావు, పటాన్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుడుపాముల గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం





తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి వారి సంక్షేమాన్ని కాపాడే ఉద్దేశంతో రామన్నపేట మండలం కుంకుడుపాముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతులెవరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని గ్రామ రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, సీఈఓ జంగారెడ్డి, గ్రామ సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్, పంచాయతీ సెక్రెటరీ శిరీష ఉప సర్పంచ్ నల్ల మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యుడు పులిగిల్ల పరమేష్, గ్రామ పెద్దలు నల్ల శ్రీనివాస్ రెడ్డి, నాతి పరశురాములుఅంగన్వాడి టీచర్ విజయ లలిత ఫీల్డ్ అసిస్టెంట్ మిరియాల రమేష్ లతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ఈవీలే శరణ్యం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్ మండలం తిమ్మాపూర్‌లో 'ఈడెన్ ఈవీ' పరిశ్రమ ప్రారంభం

షాద్‌నగర్ పారిశ్రామికవాడలో తొలి ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 5: పెరిగిపోతున్న వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగమే ఏకైక మార్గమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. పారిశ్రామిక హబ్‌గా రూపుదిద్దుకుంటున్న రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం తిమ్మాపూర్‌లో నూతనంగా నెలకొల్పిన 'ఈడెన్ ఈవీ' ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లో వాయు కాలుష్యం తీవ్ర రూపం దాల్చిందని, పెట్రోల్, డీజిల్ వాహనాల ఉద్గారాలే ఇందుకు ప్రధాన కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల మేలు కోరి ప్రతి ఒక్కరూ పర్యావరణహిత విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనే మొట్టమొదటి ఈవీ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కావడం గర్వకారణమని, ఇది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు ప్రాంతీయ పారిశ్రామిక పురోగతికి ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లవేళలా ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యూనిట్ నిర్వాహకులు బి. రవికుమార్, వేమూరి ప్రతాప్, శ్రీనివాస్ రెడ్డిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈవీల వాడకంతో ఇంధన వ్యయం భారీగా తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఆహ్వానాన్ని మన్నించి యూనిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను నిర్వాహకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివశంకర్ గౌడ్, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, సామాజికవేత్త కేకే కృష్ణ, మాజీ జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అప్పలరావుపేటలో స్వేరో ఆత్మీయ సమ్మేళనం

- గ్రామ నూతన కమిటీ ఏర్పాటు.. సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 5: నెక్కొండ మండలం అప్పలరావుపేట గ్రామంలో స్వేరో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, గ్రామ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. స్వేరో నెక్కొండ మండల అధ్యక్షుడు బొల్లెపెల్లి శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామ కన్వీనర్‌గా కొయ్యల వీరన్న, కో-కన్వీనర్‌గా తాళ్ల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నవంబర్ 22న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న స్వేరో ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వడ్డే సురేష్, మండల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పేదింట సొంతింటి కల సాకారం.. ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశ వేడుకలు

- పెద్ద ఎల్కిచర్లలో లబ్ధిదారుల ఇంట్లో సందడి.. పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు





తొలి అక్షరం/జిల్లేడు చౌదరిగూడెం, నవంబర్ 5: జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలను అందజేసి కుటుంబ సభ్యులను అభినందించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గోబ్రా నాయక్, రజిత, ఆంజనేయులు, దామోదర్, యాదయ్య, నరసింహులు, రవికుమార్, మల్లేష్, వెంకట నరసింహారెడ్డి, నాగేందర్ నాయక్, ఎల్లేశ్వర్, నవీన్ గౌడ్, కుమార్, నీలయ్య, చందు నాయక్, బందయ్య, సత్యం, ఘనపూర్ శివ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చామల రంగనాయకమ్మ మృతి చాలా బాధాకరం: దైద రవీందర్

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: శాలిగౌరారం మండల కేంద్రంలో పార్లమెంటు సభ్యులు లిచామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ చామల రంగనాయకమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న దైద రవీందర్ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రంగనాయకమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించినరు. ఈ కార్యక్రమంలోబ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి బీరోల్ శేఖర్ రెడ్డి ఉపేందర్ రెడ్డి భూపతి నరేష్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుడుని ఆశీర్వదించిన నెక్కొండ మండల కాంగ్రెస్ నాయకులు



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 5: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరపల్లి ఉపసర్పంచ్ ఎర్ర సుజాత –రాజు ల కుమారుడు ఎర్ర మిథున్ రెడ్డి పంచె కట్టుట వేడుకకి హాజరై చిన్నారుడుని ఆశీర్వదించిన ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘునాథ్, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి అనుముల శ్రీధర్ రెడ్డి,మైనారిటీ కాంగ్రెస్ నాయకులు షైక్ షబ్బీర్,సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి,కొల్లి రామచంద్రారెడ్డి,లావుడ్యా వాగ్య నాయక్ తండా సర్పంచ్ భూక్యా బాజు (మీట్టు నాయక్),భూక్యా చిట్టి భూక్యా విజన్ బాబు జవహర్ లాల్,,రాకేష్ శ్రీరామ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

- గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఓటు ప్రాధాన్యతపై వివరించిన నాయకులు



తొలి అక్షరం/వలిగొండ, నవంబర్ 5: వలిగొండ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు, దాని ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ, బీజేవైఎం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వలిగొండ టౌన్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి బట్టు క్రాంతి మాట్లాడుతూ అర్హులైన గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేసుకొని, ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.అనంతరం స్థానిక గాయత్రి హైస్కూల్‌లో ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బుంగమట్ల మహేష్, మండల అధ్యక్షుడు మైసోళ్ల మత్స్యగిరి, అమనగంటి శివ, శిష్టి సాయి, తమ్మల పవన్, మటూరి సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



తొలి అక్షరం/వలిగొండ, నవంబర్ 5:వలిగొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం హెల్ప్‌డెస్క్‌ను తహసీల్దార్ దశరథ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, జీపీఓలు స్రవంతి, వెంకటేశం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హరిహరపుత్ర కమిటీకి నూతన సారథి

- అధ్యక్షుడిగా కల్లెడ మధు ఏకగ్రీవ ఎన్నిక.. సభ్యుల హర్షం



తొలిఅక్షరం /నర్సింహులపేట, నవంబర్ 5 : మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దీక్ష కుటీర కమిటీ నూతన కార్యవర్గాన్ని సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కల్లెడ మధు ఎన్నికయ్యారు.నూతన కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి. అధ్యక్షుడిగా కల్లెడ మధు, ఉపాధ్యక్షుడిగా గుండాల బిక్షం, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర నర్సయ్య, కోశాధికారిగా రాజేందర్, గౌరవ సలహాదారులుగా మొగలగాని యాదగిరి, కల్లెడ రమేష్, దేవేంద్ర శర్మ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కల్లెడ మధు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించే భక్తులకు వారి సమయానుకూలంగా అన్ని విధాలా వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎర్రనాగి రమేష్, మంచాల వేణు, అనుమండ్ల వెంకటరెడ్డి, మార్క శేఖర్, బండి రమేష్, గుర్రాల ఎల్లయ్య, మంద సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి: జోగు అంజన్న



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 6:జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యపై తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది.ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కేకే కమిటీ సిఫారసుల అమలులో జాప్యం, ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించకపోవడం వల్ల ఉద్యమకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఉద్యమకారులకు న్యాయం చేయకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు గుండు దయానంద్, జగన్ యాదవ్, శ్యామల, నందగిరి రజినీకాంత్, సంజీవరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో నూతన మోటార్ల ప్రారంభం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 6:రామన్నపేట పట్టణంలోని పద్మశాలి కాలనీలో సంగిశెట్టి శేఖర్ ఇంటి సమీపంలో, జనంపల్లి రోడ్డులోని ఎల్లమ్మ గుడి వద్ద రెండు 5 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేశారు. నూతన మోటార్లను సర్పంచ్ గరిక సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోట్ రమేష్, పంచాయతీ కార్యదర్శి వంగాల సైదిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఎదెళ్ల యాదవ రెడ్డి జన్మదిన వేడుకలు!



నెల్లికుదురులో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడు

తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 6: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎదెళ్ల యాదవ రెడ్డి జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పండుగ వాతావరణంలో వేడుకలు ఘనంగా



నిర్వహించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి యాదవ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి యాదవ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నారని కొనియాడా రు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పులి వెంకన్న, శ్రీనివాస్, అశోక్, గుండెబోయిన అశోక్ నాయక్, వాసు, కత్తుల యాకాంతం, నలమాస శ్రీనివాస్, రావుల సతీష్, మద్ది రాజేష్, పట్నం శెట్టి నాగరాజు, అమ్రు నాయక్, భాస్కర్ నాయక్, గుగులోతు సోమన్న, వారిపల్లి పూర్ణ, బెల్లి నరసయ్య, గుదే యుగేందర్, గోవర్ధన్ రెడ్డి, బాలాజీ నాయక్, తాళ్లపల్లి వెంకన్న, ఇట్టే దేవేందర్ రెడ్డి, వలబోజు వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పనిచేయక ప్రజల ఆవేదన

రీఛార్జ్ లేక నిలిచిపోయిన రికార్డింగ్..

భద్రతపై ఆందోళన

గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?

తొలిఅక్షరం/నర్సింహులపేట, నవంబరు 5: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడంతో వాటి ప్రయోజనం నెరవేరడం లేదని వాపోతున్నారు.కెమెరాలకు విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ, రీఛార్జ్ చేయకపోవడంతో రికార్డింగ్ నిలిచిపోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో ఏదైనా ఘటన జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా ఆధారాలు సేకరించే అవకాశం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిర్వహణ బాధ్యత ఎవరిది?గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి లేదా పోలీసుల పర్యవేక్షణలో ఉందా? అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రీఛార్జ్ మరియు ఇతర నిర్వహణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.అలాగే సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యుల ఫోన్ నంబర్లను గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించేందుకు వీలుగా ఉంటుందని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించేనా?గ్రామాల భద్రతకు కీలకమైన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పనిచేయని కెమెరాలను పునరుద్ధరించి, నిరంతరం రికార్డింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.. పాత హోదాలతో పెత్తనం చెల్లదు: పరుపాటి వెంకట్ రెడ్డి

అధిష్టానం ఆదేశాలే ప్రతి నాయకుడు, కార్యకర్తకు శిరోధార్యం కావాలి.

గతంలో నిర్వహించిన పదవులను ప్రస్తుత హోదాలుగా చెప్పుకోవడం సరికాదు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పవు.

వ్యక్తిగత ఆధిపత్యం, గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి పనిచేయాలి.

తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 6: మహబూబాద్ జిల్లా నెల్లికుదురు: బీఆర్ఎస్ పార్టీలో ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ క్రమశిక్షణకు లోబడి పనిచేయాలని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పరుపాటి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పార్టీ పదవుల్లో కొనసాగిన వారు ప్రస్తుతం మాజీ పదవీధారులేనని, పాత హోదాలను కొనసాగిస్తున్నట్లు ప్రకటించుకుంటూ గ్రామాల్లో వ్యక్తిగత ఆధిపత్యం కోసం వ్యవహరించడం సరికాదన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయాలను గౌరవించకుండా సొంత నిర్ణయాలతో ముందుకు వెళ్లడం పార్టీకి నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వ్యక్తిగత విభేదాలు, గ్రూపు రాజకీయాలతో కార్యకర్తల మధ్య ఐక్యతను దెబ్బతీయవద్దని, పార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.



భూ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ

భూభారతి దరఖాస్తులు నవంబర్ 15లోగా క్లియర్ చేయాలి.. రికార్డుల తారుమారుపై కఠిన చర్యలు



తొలి అక్షరం/రంగారెడ్డి జిల్లా, నవంబర్ 5:జిల్లాలో భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రారెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు.భూభారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సుమారు 22 వేల దరఖాస్తులను నవంబర్ 15లోగా పరిష్కరించాలని సూచించారు. జీవో 118 దరఖాస్తులను వారం రోజుల్లో, జీవో 59, 92 దరఖాస్తులను 15 రోజుల్లోగా క్లియర్ చేయాలని ఆదేశించారు. యూఎల్‌సీ, 90-డి దరఖాస్తులను రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పరిష్కరించాలని తెలిపారు.భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామసభలకు ముందుగానే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ, రిజర్వు భూముల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. తప్పుడు నివేదికలు, రికార్డుల తారుమారు, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు, డీఆర్ఓ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేయాలి: కామ సంజీవరావు

నవంబర్ 14న హైదరాబాద్‌లో ఘనంగా 50 ఏళ్ల స్వర్ణోత్సవ సభలు

దళితుల హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతర పోరాటం

విద్య, ఉద్యోగ, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ఉద్యమాలు



తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 6: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు: అంబేద్కర్ యువజన సంఘం 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సభలను విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు, దళితరత్న కామ సంజీవరావు పిలుపునిచ్చారు. గురువారం నెల్లికుదురు మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు దండంపల్లి సైదులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన, రాష్ట్ర సహాయ కార్యదర్శి తప్పెట్ల వీరన్న మాట్లాడారు. నవంబర్ 14న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం ఆవిర్భావం నుంచి నేటి వరకు దళితుల విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధనతో పాటు రిజర్వేషన్ల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ స్వర్ణోత్సవ సభలకు సంఘం నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ మండల అధ్యక్షుడు కడారి ఐలయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుళ్ల వెంకన్న, మండల కోశాధికారి శివార్ల నాగేష్ బాబు, మంద ఉప్పలయ్య, కడారి శ్రీకాంత్, హెచ్. అశోక్ పాల్గొన్నారు.

వార్డు సభ్యుల ఐక్యతతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం

కొత్తూరు మండల వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షురాలిగా కుమ్మెర పవిత్ర ఏకగ్రీవ ఎన్నిక



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 5: కొత్తూరు మండల వార్డు సభ్యుల ఫోరం నూతన అధ్యక్షురాలిగా మల్లాపూర్‌కు చెందిన కుమ్మెర పవిత్ర జయేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి గ్యార సురేష్, కో-ఇన్‌చార్జి మల్లేష్, షాద్‌నగర్ తాలూకా అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.షాద్‌నగర్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షురాలిగా చిర్ర సంతోష మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షులుగా రాందాస్ నాయక్, వేదాంత చారి, రాములు నాయక్, శ్రీనివాస్ నాయక్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వప్న సదానంద్, ప్రధాన కార్యదర్శులుగా బిక్ష్మ నాయక్, కుమార్, కార్యదర్శులుగా స్రవంతి మైపాల్, మండల కార్యదర్శిగా పబ్బే స్వర్ణలత జనార్ధన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పవిత్ర జయేందర్‌రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యులంతా ఐక్యంగా పనిచేస్తూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫోరం బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫరూక్‌నగర్, నందిగామ మండలాల ఫోరం అధ్యక్షులు, కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో నూతనంగా బోన్ సెట్టింగ్ కేంద్రం ప్రారంభం

- **ప్రజలకు స్థానికంగానే మెరుగైన సేవలు అందుబాటులోకి రావాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05: షాద్‌నగర్ పట్టణంలో మరో నూతన సేవా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. నాగులపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన 'శ్రీకాంత్ శ్రీ బోన్ సెట్టింగ్ సెంటర్'ను గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎముకలు, కీళ్లు, కండరాలకు సంబంధించిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల్లో ఎముకలు విరగడం, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు ఎదురైనప్పుడు అర్హత కలిగిన వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలని తెలిపారు. నూతనంగా ప్రారంభమైన కేంద్రం ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కౌన్సిలర్ మురళీమోహన్ అప్పి, కాంగ్రెస్ నాయకులు రాయికల్ శ్రీనివాస్, బుద్ద నరసింహ తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్‌కు చెందిన పలువురు జర్నలిస్టులు కూడా హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్టులు ఖాజా పాషా, రంగనాథ్‌తో పాటు రాఘవేందర్, శరత్‌కుమార్, సాయినాథ్ రెడ్డి, సురేష్, ఆవుల రమేష్, దిర్శనం శంకర్,జగన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ..

రాయికల్ టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసుల అవగాహన.. 42 మందికి సూచనలు



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 5: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశం సూచించారు. గురువారం సాయంత్రం రాయికల్ టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 42 మంది వాహనదారులకు హెల్మెట్ వినియోగం, సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వెంకటేశం సూచించారు. బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ, ఏఎస్ఐ, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్ విద్యుత్ రంగానికి రూ.33 కోట్ల నిధులు

7 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు.. ఒక్కరోజులో 2 కి.మీ. లైన్, 10 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 5:షాద్‌నగర్ నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసి రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈ శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.గత రెండేళ్లలో సుమారు రూ.33 కోట్లతో 1,100 మంది రైతులకు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు అందించినట్లు తెలిపారు. మరో 15 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. పునుపూర్ తదితర ప్రాంతాల్లో రైతుల అవసరాల మేరకు ఒక్కరోజులోనే 2 కిలోమీటర్ల విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి, 10 ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాల కోసం ఏడు కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో భూసేకరణ ప్రక్రియ వేగవంతమవుతోందన్నారు. తక్కువ నీటితో అధిక ఆదాయం పొందేందుకు రైతులు నెట్‌హౌస్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. చించోడ్ విద్యుత్ ఉపకేంద్రం వద్ద నమూనా నెట్‌హౌస్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖపై వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

పంట నష్టం సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలి

- నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తొలి అక్షరం/కల్లూరు, నవంబర్ 5:మురుసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కల్లూరు మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరిశీలించారు. చండ్రుపట్ల తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కోత దశకు చేరుకున్న వరి పంటలు నీట మునిగి, నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, పత్తి పంట కూడా దెబ్బతిన్నదని ఆయన అన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- వర్షానికి ధాన్యం తడవకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..






తొలి అక్షరం/కరీంనగర్,నవంబర్ 05: వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమయ్యేలా చూడాలని సూచించారు. గురువారం రాత్రి కరీంనగర్ ఐడీఓసీలో పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం తరలింపు, రైతులకు చెల్లింపులు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.**రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు కూడా కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులకు, రైతులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.**వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడాలి** కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, అవసరమైన ఇతర వసతులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.కటింగ్ పేరిట రైతులకు ఎలాంటి ఇబ్బందులు సృష్టించవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజనీకాంత్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రావుతో పాటు పలువురు అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐయూఎంఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్‌కు ఘన సన్మానం

- ముఖ్య కార్యకర్తల సమావేశానికి టీఎంహెచ్‌డీ నాయకుల సంఘీభావం



తొలి అక్షరం/ఖమ్మం, నవంబర్ 5:ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్‌ను తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కారిపల్లి శ్రీనివాస్ గురువారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.ఖమ్మంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఐయూఎంఎల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి టీఎంహెచ్‌డీ నాయకులు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రజాస్వామ్య పద్ధతిలో కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ జిల్లా నాయకులు బొడ్డు గురవయ్య, మునగలేటి వీరస్వామి, పిల్లిగుండ్ల ముత్తయ్య, కృష్ణమురళి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీలోకి ‘జైలర్-2’.. నవంబర్ 12 నుంచి సందడి!



ఐదు భాషల్లో స్ట్రీమింగ్.. రజనీకాంత్ అభిమానులకు శుభవార్త

హైదరాబాద్: సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు శుభవార్త. ఆయన నటించిన భారీ యాక్షన్ చిత్రం ‘జైలర్-2’ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో నవంబర్ 12 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. గురువారం ప్రైమ్ వీడియో సంస్థ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. **భారీ తారాగణంతో..**నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో అలరించారు. మోహన్‌లాల్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి ప్రత్యేక పాత్రల్లో కనిపించగా.. శివరాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. **రికార్డు స్థాయి వసూళ్లు..**థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించి తమిళ చిత్ర పరిశ్రమలో రికార్డులు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.820 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దీంతో రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. థియేటర్లలో విజయవంతమైన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోనూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

తెలుగు రాష్ట్రాల్లో ‘రామాయణ’కు రూ.100 కోట్ల టార్గెట్!



రూ.54 కోట్లకు థియేట్రికల్ హక్కుల విక్రయం.. బ్రేక్ ఈవెన్ సాధ్యమేనా?

హైదరాబాద్: భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన పౌరాణిక చిత్రం ‘రామాయణ’ తెలుగు రాష్ట్రాల్లో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర చర్చకు తెరలేపింది. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటించారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. **రూ.54 కోట్లకు హక్కుల విక్రయం..**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాత, పంపిణీదారు దిల్ రాజు సుమారు రూ.54 కోట్లకు దక్కించుకున్నట్లు ట్రేడ్ వర్గాల అంచనా. ఈ పెట్టుబడిని వెనక్కి రాబట్టి బ్రేక్ ఈవెన్ సాధించాలంటే తెలుగు రాష్ట్రాల్లో సినిమా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఒక హిందీ డబ్బింగ్ చిత్రానికి తెలుగు మార్కెట్‌లో ఇంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. **యశ్ క్రేజ్‌పై భారీ ఆశలు..**ఈ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో యశ్ క్రేజ్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ‘కేజీఎఫ్’ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన యశ్ రావణుడి పాత్రలో కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి నటనతో పాటు భారీ విజువల్ ఎఫెక్ట్స్, యుద్ధ సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటాయన్నది కీలకంగా మారింది. రామాయణ గాథతో తెలుగు ప్రేక్షకులకు ఉన్న అనుబంధం కూడా సినిమాకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. **అడ్వాన్స్ బుకింగ్స్‌పై దృష్టి..**తెలుగు రాష్ట్రాల్లో ముందస్తు టికెట్ బుకింగ్స్ ద్వారా సుమారు రూ.6 కోట్ల వసూళ్లు నమోదైనట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన, మౌత్ టాక్ వసూళ్లపై ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా తొలి వారాంతంలో వచ్చే కలెక్షన్లు రూ.100 కోట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా కీలకం కానున్నాయి. **దిల్ రాజుకు కీలక పరీక్ష..**భారీ ధరకు హక్కులు సొంతం చేసుకున్న దిల్ రాజుకు ఈ సినిమా వసూళ్లు కీలకంగా మారాయి. ప్రేక్షకుల ఆదరణతోనే పెట్టుబడి వెనక్కి వచ్చే అవకాశం ఉంటుంది. భారీ అంచనాలు, స్టార్ నటీనటులు, ఇతిహాస కథాంశం సినిమాకు బలంగా ఉన్నప్పటికీ.. తెలుగు రాష్ట్రాల్లో రూ.100 కోట్ల గ్రాస్ సాధించడం ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి.

కుటుంబ భావోద్వేగాలు.. మధురమైన సంగీతంతో ‘మాయలేడి’!

నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల.. రాకేష్ వర్రే, మధుమిత సర్కార్ జంటగా నటించిన చిత్రం



హైదరాబాద్: యంగ్ హీరో, నిర్మాత రాకేష్ వర్రే నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం ‘మాయలేడి’ విడుదలకు సిద్ధమైంది. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. మధుమిత సర్కార్ కథానాయికగా నటిస్తోంది. ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా హైదరాబాద్‌లో చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. **ప్రేమలోని భావోద్వేగాలే కథాంశం..**దర్శకుడు ప్రశంకర్ మాట్లాడుతూ.. ప్రేమ సంబంధాల్లో ఎదురయ్యే అనేక భావోద్వేగాలను సినిమాలో చూపించామని తెలిపారు. క్రిష్ అనే యువకుడు తన ప్రేయసిలోని విభిన్నమైన భావాలను ఎలా ఎదుర్కొన్నాడన్నది ఆసక్తికరంగా తెరకెక్కించామని చెప్పారు. మంచి సంగీతం, వినోదంతో పాటు చిన్న సందేశం కూడా సినిమాలో ఉంటుందని వెల్లడించారు.

కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా..హీరో, నిర్మాత రాకేష్ వర్రే మాట్లాడుతూ.. ‘మన్మథుడు’, ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘నిన్నే పెళ్లాడతా’ వంటి చిత్రాల తరహాలో కుటుంబ అంశాలు, సంగీతానికి ప్రాధాన్యమిస్తూ ‘మాయలేడి’ని రూపొందించామని తెలిపారు. ‘ఖుషి’ తరహా ప్రేమకథను తెరపై చూసి చాలా కాలమైందని, వరుసగా యాక్షన్ చిత్రాలు వస్తున్న తరుణంలో తమ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మధుమిత సర్కార్, మధురిమ, అంజి, భార్గవ నౌండ్ల తదితరులు పాల్గొన్నారు.



సూర్యతో నజ్రియా.. ‘సీన్’తో లీఎంట్రీ!

హైదరాబాద్: ప్రముఖ నటి నజ్రియా నజీమ్ కొంతకాలం విరామం తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలోకి తిరిగి వస్తున్నారు. సూర్య హీరోగా నటిస్తున్న ‘సీన్’ చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నజ్రియా ‘మాయ’ పాత్ర పోషిస్తున్నారు. నవంబర్ 6న దీపావళి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సూర్యతో నజ్రియా తొలిసారి జోడీ కడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

తెలుగు, దక్షిణాది సినిమాలపై రాధికా ఆప్టే తీవ్ర విమర్శలు!

హీరోయిన్ల ఎంపికపై అభ్యంతరాలు.. హీరోల వయసు, కథల్లోని సంప్రదాయాలపైనా వ్యాఖ్యలు



హైదరాబాద్: నటి రాధికా ఆప్టే తెలుగు, దక్షిణాది చిత్ర పరిశ్రమలపై చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన తాజా వెబ్‌సిరీస్ ‘అక్క’ ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆమె దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల ఎంపిక, కథాంశాలు, నటీనటుల పాత్రలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. **హీరోతో రొమాన్స్ చేయడం ఇబ్బందిగా అనిపించింది..**దాదాపు 12 ఏళ్ల క్రితం తెలుగులో నటించిన ఓ ప్రముఖ హీరో చిత్రంలో తనకంటే చాలా పెద్ద వయసున్న నటుడితో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని రాధికా ఆప్టే తెలిపారు. ఆ సినిమాలోని కొన్ని సన్నివేశాలు తనకు అసౌకర్యంగా అనిపించాయని చెప్పారు.

స్మార్ట్‌గా చేయాలనుకుంటే.. కామెడీ అయిపోతుంది!

- ‘దొంగ నా కొడుకు’తో హీరోయిన్‌గా పరిచయమవుతున్న సుష్మితా శెట్టి

హైదరాబాద్: తాను ఏదైనా స్మార్ట్‌గా చేయాలనుకుంటే అది చివరకు కామెడీగా మారిపోతుందని ‘దొంగ నా కొడుకు’ చిత్ర హీరోయిన్ సుష్మితా శెట్టి సరదాగా వ్యాఖ్యానించారు. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు. ఈ సినిమాలో తాను చాలా చలాకీగా, కొంచెం తింగరిగా ప్రవర్తించే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని సుష్మిత తెలిపారు. హీరో ఈశ్వర్‌ను గాఢంగా ప్రేమించే యువతిగా, ప్రేమ కోసం ఏమైనా చేసే స్వభావంతో తన పాత్ర ఉంటుందని చెప్పారు. తెలియకుండానే కొన్ని నేరాల్లో అమాయకంగా ఇరుక్కుంటూ ఉంటానని వెల్లడించారు. సినిమా చూసిన ప్రేక్షకులు నవ్వుకుంటూ థియేటర్ల నుంచి బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. **శ్రీదేవి స్ఫూర్తితో నటనలోకి..**‘దొంగ నా కొడుకు’ తనకు కథానాయికగా తొలి చిత్రమని, గతంలో ‘జగమే సంగీతం’ వెబ్‌సిరీస్‌లో నటించానని తెలిపారు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన తాను విదేశాల్లో చదువుకున్నానని, అక్కడ థియేటర్ కూడా చేశానని చెప్పారు. చిన్నప్పటి నుంచి నృత్యంపై ఆసక్తితో అన్ని రకాల నృత్యాలు నేర్చుకున్నానని, వాటి ద్వారానే నటనపై ఆసక్తి పెరిగిందని వివరించారు. నటి శ్రీదేవి తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. **విభిన్న పాత్రలు చేయాలని ఉంది..**‘మహానటి’ తనకు ఇష్టమైన చిత్రమని, అందులోని అన్ని రకాల భావోద్వేగాలతో కూడిన పాత్ర చేయాలని ఉందని సుష్మిత తెలిపారు. క్రీడా నేపథ్య చిత్రాల్లోనూ నటించాలని ఉందన్నారు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.